# గురుకుల పాఠశాలలో జోనల్ అధికారి ఆకస్మిక తనిఖీ

**పాఠశాల నిర్వహణపై సంతృప్తి**

**విద్యా ప్రమాణాల పెంపుపై దిశానిర్దేశం**







**కల్లూరు, జూలై 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల మరియు జూనియర్ కళాశాల, కల్లూరును జోనల్ అధికారి ఆపర్ణ శనివారం ఆకస్మికంగా సందర్శించి సమగ్రంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని కిచెన్, డైనింగ్ హాల్, ప్రొవిజన్ రూమ్, రైస్ స్టోర్, వెజిటబుల్ రూమ్, డార్మిటరీలతో పాటు అన్ని రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన ఆమె, నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.రెండో శనివారం సందర్భంగా నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో పాల్గొన్న ఆపర్ణ మాట్లాడుతూ, విద్యార్థులను సకాలంలో పాఠశాలకు పంపించాలని, గైర్హాజరు శాతం తగ్గేలా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల అభ్యాస నైపుణ్యాలను పెంపొందించే మైండ్ స్పార్క్ కార్యక్రమాన్ని ప్రతి తల్లిదండ్రి ప్రోత్సహించాలని కోరారు. పేరెంట్స్ కమిటీలలో మహిళలకు అధిక ప్రాధాన్యం కల్పించాలని, అలాగే పాఠశాలకు సమీపంలో నివసించే వారిని కమిటీలో ఎంపిక చేస్తే మరింత సమర్థవంతంగా పనిచేయవచ్చని సూచించారు. ఈ సందర్భంగా పాఠశాల సిబ్బంది, పేరెంట్స్ కమిటీ సభ్యులు పాఠశాలలో ఉన్న బాత్రూమ్ సమస్యతో పాటు కోతుల బెడద నివారణకు సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఆపర్ణ మేడం హామీ ఇచ్చారు. అనంతరం ఉపాధ్యాయులు, సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించిన ఆమె, పదో తరగతి మరియు ఇంటర్మీడియట్‌లో వంద శాతం ఉత్తీర్ణత సాధించే లక్ష్యంతో పనిచేయాలని సూచించారు. విద్యార్థులను నిరంతరం ప్రోత్సహిస్తూ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి బోధన చేపట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాల సిబ్బంది సమిష్టిగా పనిచేస్తున్న తీరును అభినందించారు. వర్షాకాలం నేపథ్యంలో విద్యార్థుల ఆరోగ్యం, భద్రత విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.జోనల్ అధికారి పాఠశాలలో పరిశీలించిన అన్ని అంశాలపై సంతృప్తి వ్యక్తం చేశారని పాఠశాల ప్రిన్సిపాల్ పి. కనకదుర్గ తెలిపారు.

# నిస్సహాయ వృద్ధురాలికి అండగా ప్రజా సంక్షేమ వేదిక

**• బియ్యం, నిత్యావసర సరుకులు అందించిన అధ్యక్షుడు మడికొండ రఘుపతి**



**భూపాలపల్లి, జూలై 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** భూపాలపల్లి జిల్లా చెల్పూరు గ్రామానికి చెందిన సమ్మక్క భర్త సమ్మయ్య ఇటీవల మరణించడంతో ఆ కుటుంబం తీవ్ర విషాదంలో, నిస్సహాయ స్థితిలో ఉంది. ఈ విషయం తెలుసుకున్న ప్రజా సంక్షేమ వేదిక అధ్యక్షుడు మడికొండ రఘుపతి శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా వృద్ధురాలు సమ్మక్కకు బియ్యము తో పాటు నిత్యావసర సరుకులను అందజేసి అండగా నిలిచారు. ఆమెకు వృద్ధాప్య పింఛన్ అందుతున్నదా లేదా అనే విషయాన్ని అడిగి తెలుసుకొని, ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు. ఎలాంటి ఆందోళన చెందవద్దని, ప్రజా సంక్షేమ వేదిక తరఫున అన్ని విధాలా సహకారం అందిస్తామని హామీ ఇస్తూ మనోధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంక్షేమ వేదిక అధ్యక్షుడు మడికొండ రఘుపతితో పాటు నాయకులు శిరీష, లావణ్య, వసంత రాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల ప్రాణాలతో ఆడుకుంటున్న కాంట్రాక్టర్..!

**ఏటూరునాగారంలో ప్రమాదకర స్పీడ్ బ్రేకర్**

**మరో ప్రాణాన్ని బలితీసుకునే పరిస్థితి**



**ఏటూరునాగారం:జూలై 11 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఐటీడీఏ కార్యాలయం పక్కనున్న ప్రధాన రహదారిపై నిర్మించిన స్పీడ్ బ్రేకర్ మరోసారి ప్రమాదానికి కారణమైంది. చిన్నబోయినపల్లికి చెందిన తాటి బీమా తహశీల్దార్ కార్యాలయానికి పని నిమిత్తం ఏటూరునాగారం వచ్చాడు. రెండో శనివారం కావడంతో అధికారులు అందుబాటులో లేకపోవడంతో తిరిగి స్వగ్రామానికి వెళ్తున్న సమయంలో ఐటీడీఏ కార్యాలయం సమీపంలోని స్పీడ్ బ్రేకర్ వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి స్కిడ్ అయి కిందపడిపోయాడు. ఈ ప్రమాదంలో అతడికి తలకు తీవ్ర గాయాలు కావడంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికులు వెంటనే స్పందించి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.స్థానికుల కథనం ప్రకారం, ఇదే స్పీడ్ బ్రేకర్ కారణంగా గతంలో కూడా అనేక ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. దీనిపై పలుమార్లు వార్తలు వచ్చినప్పటికీ సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్ ఎలాంటి చర్యలు తీసుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు మరో వ్యక్తి చావుబతుకుల మధ్య పోరాడుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారి తుపాకులగూడెం, కన్నాయిగూడెం తదితర గ్రామాలకు వెళ్లే ప్రధాన మార్గం కావడంతో బస్సులు, అంబులెన్సులు, అత్యవసర సేవల వాహనాలు, ఐటీడీఏ ఉద్యోగులు, సాధారణ వాహనదారులు నిత్యం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గతంలో కూడా అంబులెన్స్ ఈ స్పీడ్ బ్రేకర్ వద్ద ఇబ్బందులు ఎదుర్కొన్న ఘటనలు ఉన్నాయని గుర్తు చేశారు.ప్రజల డిమాండ్: నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా నిర్మించిన ఈ ప్రమాదకర స్పీడ్ బ్రేకర్‌ను వెంటనే తొలగించి, రోడ్డు భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా కొత్త స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు చేయాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు. మరో ప్రాణనష్టం జరగకముందే అధికారులు స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# నిరుపేద కుటుంబానికి ఆర్థిక సహాయం..



**రామడుగు, జూలై 11(పిసిడబ్ల్యూ న్యూస్):** రామడుగు మండల కేంద్రం కి చెందిన నిరుపేద కుటుంబ సభ్యులు జిట్టవేణి అంజయ్య నిన్న అర్ధరాత్రి కన్నుమూశారు. వారి మృతి పట్ల ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసిన మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మరవేణి తిరుమల తిరుపతి వారి కుటుంబ సభ్యులకు అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం రూ.5,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, అంజయ్య ఆత్మకు శాంతిచేకూరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కారుపాకల నరేష్, మామిడి నర్సయ్య, బోయిని బాలయ్య, పెసరి ఎల్లయ్య, జిట్టవేణి రమేష్, జిట్టవేణి రాజు, జిట్టవేణి రాకేష్ తదితరులు ఉన్నారు.

# చొప్పదండి నియోజకవర్గ యువతకు దిక్సూచి మేడిపల్లి సత్యం..






**రామడుగు జులై 11 (పీసీడబ్ల్యూ న్యూస్ ):** కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు చొప్పదండి నియోజక వర్గ అభివృద్ధి పనులకు నియోజక వర్గంలో యువకుల పట్ల చూపిస్తున్న నిబద్ధత కు చొప్పదండి నియోజక వర్గాన్ని రాష్ట్రం లో ఒక రోల్ మోడల్ గా తీర్చిదిద్దాలని నిరంతరం కృషి చేస్తూ యువత పెద్ద పీట వేస్తున్న ఎంఎల్ఏ మేడిపల్లి సత్యం పనితనానికి ఆకర్షితులై చొప్పదండి నియోజక వర్గం లోని రామడుగు మండలం గోపాలరావుపేట గ్రామానికి చెందిన వార్డు సభ్యులు తూర్పటి అనిల్ ఆధ్వర్యంలో, గదరవేణి తిరుపతి, పైండ్ల రాజు వారితో 100 మంది కి పైగా యువకులు కాంగ్రెస్ పార్టీ లో చేరగా నేడు గంగాధర ప్రజా కార్యాలయం లో వారికి కండువా కప్పి పార్టీ లోకి ఆహ్వానించి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని యువకులు దేశానికి ఆదర్శంగా నిలవాలని కోరిన చొప్పదండి శాసన సభ్యులు కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు రాష్ట్ర అసెంబ్లీ ఎస్సీ సంక్షేమ కమిటీ చైర్మన్ మేడిపల్లి సత్యం ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుల మాజి ఎంపిపి జవ్వాజి హరీష్ మాజి ఎంపీటీసీ ఎడవెల్లి నరేదర్ రెడ్డి, AMC వైస్ చైర్మన్ పిండి సత్యం రెడ్డి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# బస్సు ప్రమాద బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్

**గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు ఆదేశం**





**కల్లూరు, జూలై 11 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ముఖ్యమంత్రి సభకు వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో కల్లూరు పుల్లయ్య బంజర రోడ్డుకు చెందిన బస్సు ప్రమాదానికి గురైన 11 మంది గాయపడిన బాధితులను సత్తుపల్లి శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ శనివారం కల్లూరు ప్రభుత్వ ఆసుపత్రిలో పరామర్శించారు. ప్రమాదంలో గాయపడిన వారి ఆరోగ్య పరిస్థితిని ప్రభుత్వ వైద్యులను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే, బాధితులకు అవసరమైన అన్ని రకాల మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. అలాగే గాయపడిన వారితో మాట్లాడి ధైర్యం చెప్పడంతో పాటు వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి మాట్లాడుతూ బాధితులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం తరఫున అవసరమైన వైద్య సహాయం అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కల్లూరు మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్, ఏఎంసీ చైర్మన్ బాగం నీరజ, ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు సీనియర్ నాయకులు పసుమర్తి చందర్‌రావు, మున్సిపల్ వైస్ చైర్మన్ శీలం కోటేశ్వరి కృష్ణారెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, కల్లూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పొట్రూ అర్జున్‌రావు, కల్లూరు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ ఉస్మాన్, కాంగ్రెస్ పార్టీ పట్టణ, మండల నాయకులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ప్రభుత్వ వైద్యులు డాక్టర్ రమేష్ , వైద్య సిబ్బంది, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పేదల కన్నీళ్లు తుడవడమే ప్రభుత్వ లక్ష్యం

**• సీఎంఆర్ఎఫ్, కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**



**ఖమ్మం ప్రతినిధి, జూలై 11 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఆపదలో ఉన్న ప్రతి నిరుపేద కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని, పేదల కన్నీళ్లు తుడవడమే తమ ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఖమ్మం రూరల్ మండలం, ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 129 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.35,91,500 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులతో పాటు, ఖమ్మం రూరల్ మండలానికి చెందిన మూడు కళ్యాణలక్ష్మి చెక్కులను శనివారం ఖమ్మంలోని తన క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. నిరుపేదలకు వైద్య ఖర్చుల భారం కాకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి సహాయ నిధిని వేగంగా అందిస్తున్నామన్నారు. అలాగే ఆడబిడ్డల పెళ్లిళ్లకు కళ్యాణలక్ష్మి పథకం ఎంతో ఆసరాగా నిలుస్తోందని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు సకాలంలో అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి, స్థానిక కాంగ్రెస్ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# మల్లంపల్లిలో ఘనంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ జన్మదిన వేడుకలు

**• కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసిన బీజేపీ నాయకులు**



**మల్లంపల్లి మండలం, జూలై 11(పిసిడబ్ల్యూ న్యూస్):** భారతీయ జనతా పార్టీ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ జన్మదిన వేడుకలను మల్లంపల్లి మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు బైకాని మహేందర్ యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేస్తూ బండి సంజయ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ, బండి సంజయ్ ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తూ, పార్టీ బలోపేతానికి అహర్నిశలు శ్రమిస్తున్న నాయకుడని కొనియాడారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో ఆయన కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం, దేశాభివృద్ధే లక్ష్యంగా ఆయన చేస్తున్న సేవలు ఆదర్శప్రాయమని అన్నారు. జన్మదినాన్ని పురస్కరించుకుని నాయకులు ఒకరికి ఒకరు స్వీట్లు తినిపించుకుని ఆనందాన్ని పంచుకున్నారు. పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని బండి సంజయ్‌కు దీర్ఘాయుష్షు, మంచి ఆరోగ్యం కలగాలని ఆకాంక్షిస్తూ నినాదాలు చేశారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది. ఈ కార్యక్రమంలో ఓబీసీ జిల్లా అధ్యక్షులు దండిగా వెంకన్న, బీజేవైఎం జిల్లా జనరల్ సెక్రటరీ కత్తి హరీష్ గౌడ్, మండల ఉపాధ్యక్షులు కొండ యుగంధర్, గొట్టేముక్కల నరేష్ శర్మ, కొలిపాక రవి, గడ్డం రాజు, తాడుక ఐలయ్యతో పాటు బీజేపీ మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రిటైర్డ్ ఉద్యోగుల హక్కుల పోరాటానికి సరికొత్త బలం

**- రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా 'ఖమ్మం ముద్దుబిడ్డ' దుబాకుల వెంకటేశ్వర్లు ఏకగ్రీవ ఎన్నిక!**

**- పెన్షనర్ల గుండె చప్పుడుగా మారిన సదస్సు**

**- హెల్త్ కార్డులు, పీఆర్సీ సాధనే లక్ష్యంగా ఐక్యతా శంఖారావం!**

**ఖమ్మం ప్రతినిధి, జూలై 11 (పిసిడబ్ల్యూ న్యూస్) :** జీవితాంతం సమాజసేవకై అంకితమై, విశ్రాంత జీవనంలోనూ హక్కుల సాధన కోసం అలుపెరగని పోరాటం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ప్రస్థానంలో ఒక నూతన అధ్యాయం లిఖించబడింది. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఖమ్మం జిల్లాకు చెందిన నిబద్ధత గల నాయకుడు దుబాకుల వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హైదరాబాద్ సుల్తాన్‌బజార్‌లోని రాష్ట్ర కార్యాలయంలో, పూర్వ ప్రధాన కార్యదర్శి లింగన్న రాజీనామా నేపథ్యంలో వెంకటేశ్వర్లును ఈ ఉన్నత బాధ్యతకు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ చారిత్రాత్మక నిర్ణయంపై ఖమ్మం జిల్లా శాఖ హర్షాతిరేకాలు వ్యక్తం చేసింది.





**సన్మాన సభలో పొంగిపొర్లిన ఆత్మీయత ఉద్యమ స్ఫూర్తి :** తమ జిల్లా నేతకు రాష్ట్రస్థాయిలో అత్యున్నత గౌరవం దక్కడంతో, శనివారం ఖమ్మంలో జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం ఆత్మీయ ఆనందోత్సాహాల మధ్య జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం. సుబ్బయ్య, తాళ్లూరి వేణు నూతన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుబాకుల వెంకటేశ్వర్లును శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సన్మానం కేవలం ఒక వ్యక్తికి జరిగిన గౌరవం కాదు, ఖమ్మం జిల్లా ఉద్యమ గడ్డపై పెన్షనర్ల ఐక్యతకు దక్కిన గుర్తింపు అని నాయకులు కొనియాడారు.

**ఆవేదనల అక్షర రూపం.. ప్రభుత్వంపై హక్కుల పోరాటం :** ఈ సదస్సులో రిటైర్డ్ ఉద్యోగుల శ్రమను, వారి ప్రస్తుత బాధలను నాయకులు హృదయానికి హత్తుకునేలా ప్రస్తావించారు. దశాబ్దాల పాటు ప్రభుత్వ యంత్రాంగాన్ని నడిపించి, నేడు విశ్రాంత జీవితంలో అనారోగ్య సమస్యలతో, ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న వృద్ధ ఉద్యోగుల పట్ల ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరించడం శోచనీయమన్నారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం. సుబ్బయ్య, తాళ్లూరి వేణు మాట్లాడుతూ.. "ప్రభుత్వాలు మారినా మా బాధలు మారడం లేదు. జేఏసీకి ఇచ్చిన హామీని ప్రభుత్వం వెంటనే నిలబెట్టుకోవాలి. వృద్ధాప్యంలో ప్రాణాధారమైన 'హెల్త్ కార్డులను' ఎలాంటి కొర్రీలు లేకుండా వెంటనే జారీ చేయాలి. అలాగే, పెన్షనర్ల హక్కు అయిన 'పే రివిజన్ కమిటీ' (పిఆర్సి) ప్రయోజనాలను తక్షణమే ప్రకటించి, మా ఆత్మగౌరవాన్ని కాపాడాలి" అని డిమాండ్ చేశారు. హక్కుల సాధన కోసం ఎంతటి పోరాటానికైనా వెనుకాడబోమని ఐక్యతను చాటారు.

**బాధ్యత నాది.. భరోసా మీది : దుబాకుల వెంకటేశ్వర్లు భావోద్వేగ ప్రసంగం** సన్మాన గ్రహీత, నూతన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుబాకుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ భావోద్వేగానికి లోనయ్యారు. "నాపై ఉంచిన నమ్మకాన్ని, బాధ్యతను నా శ్వాస ఉన్నంతవరకు సక్రమంగా నిర్వర్తిస్తాను. తెలంగాణలోని 33 జిల్లాలలోని ప్రతి ఒక్క పెన్షనర్ సమస్య నా సొంత సమస్య. వృద్ధాప్యంలో ఎవరూ ఒంటరి వాళ్ళు కారు.. ఈ సంఘం అందరికీ ఒక పెద్ద దిక్కుగా ఉంటుంది. పెన్షనర్ల హక్కుల కోసం, సంక్షేమం కోసం చిత్తశుద్ధితో పనిచేస్తూ, సంఘాన్ని మరింత బలోపేతం చేస్తాను" అని హృదయపూర్వక భరోసానిచ్చారు. ఈ ఆత్మీయ ఐక్యతా సదస్సులో జిల్లా ఉపాధ్యక్షులు సాదినేని పూర్ణచందర్రావు, ఆర్థిక కార్యదర్శి ఆర్. వెంకట్ నారాయణ, జిల్లా కార్యదర్శి టి. జనార్ధన్, ఖాజా మైనుద్దీన్, నగర శాఖ నాయకులు సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, రమణ యాదవ్, ఆంజనేయులు, శంకర్ తదితర సీనియర్ నాయకులు పాల్గొని తమ సంఘీభావాన్ని ప్రకటించారు.

# కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించిన మేయర్ కొలగాని శ్రీనివాస్

**నగరవ్యాప్తంగా విస్తృతంగా జరిగిన బండి సంజయ్ కుమార్ పుట్టినరోజు వేడుకల్లో సేవా , అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్న మేయర్ కోలగాని శ్రీనివాస్**

**క్షేత్రస్థాయిలో దిగ్విజయనేత బండి సంజయ్, మేయర్ కోలగాని శ్రీనివాస్...**







**కరీంనగర్ టౌన్ జూలై 11(పిసిడబ్ల్యూ న్యూస్):** కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ జన్మదిన వేడుకలు శనివారం కరీంనగర్ నగరంలో అత్యంత వైభవంగా, ఘనంగా జరిగాయి. నగర పాలక సంస్థ మేయర్ కొలగాని శ్రీనివాస్ సారథ్యంలో జరిగిన ఈ వేడుకలు నగరవ్యాప్తంగా పండుగ వాతావరణాన్ని తలపించాయి. నగరంలోని ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన భారీ హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలతో బండి సంజయ్ కుమార్ పుట్టినరోజు వేడుకలు ప్రత్యేకంగా కనిపించాయి. మేయర్ కొలగాని శ్రీనివాస్ ఆధ్వర్యంలో నగరం నలుమూలలా ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ పెద్ద ఎత్తున ఫ్లెక్సీలను ఏర్పాటు చేయించారు. కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం ఉదయం మేయర్ కొలగాని శ్రీనివాస్ తీగలగుట్టపల్లిలోని తన క్యాంపు కార్యాలయం నుండి జన్మదినోత్సవ వేడుకలను ప్రారంభించి, నగరంలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన పుట్టినరోజు వేడుకల కు, ప్రోగ్రామ్ లకు హాజరయ్యారు. తీగల గుట్టపల్లి లోని కోదండ రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, బండి సంజయ్ కుమార్ ఆయురారోగ్యాలతో, ప్రజా సేవలో మరిన్ని విజయాలు సాధించాలని భగవంతుడిని మేయర్ కొలగాని శ్రీనివాస్ ప్రార్థించారు. అనంతరం తెలంగాణ చౌక్‌లో బిజెపి జిల్లా జిల్లా శాఖ, నగరపాలక సంస్థ ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో నిర్వహించిన 54 కిలోల భారీ కేక్‌ను కట్ చేసి కార్యకర్తలతో కలిసి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కరీంనగర్ బస్టాండ్ ఎదురుగా మేయర్ ఆధ్వర్యంలో చేపట్టిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని అన్న ప్రసాద వితరణ చేశారు. వీరబ్రహ్మేంద్ర స్వామి వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు దుప్పట్లు పంపిణీ చేశారు. పార్లమెంట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో, బిజెపి మైనార్టీ మోర్చా ఆధ్వర్యంలో నాకా చౌరస్తాలో చేపట్టిన రక్తదాన శిబిరంలో పాల్గొని, రక్తదాతలను ఉత్సాహపరిచారు. 35వ డివిజన్ లో మొక్కలు నాటారు. అనంతరం ఉచిత వైద్య శిబిరాన్ని మేయర్ కోలగాని శ్రీనివాస్ ప్రారంభించారు. ఉచిత వైద్య శిబిరంలో ఈసీజీ, 2డి ఈకో , బిపి, షుగర్ , ఇతర ఆరోగ్య పరీక్షలు ఉచితంగా నిర్వహించి మందులను పంపిణీ చేశారు. మంచిర్యాల చౌరస్తాలోని వికలాంగుల ఆశ్రమంలో పండ్లు పంపిణీ చేశారు. బిజెపి కార్పొరేటర్ ఏపీపీ చంద్ర (టింకు) ఆధ్వర్యంలో ప్రభుత్వ సివిల్ హాస్పిటల్ లో ఏర్పాటుచేసిన అల్పాహార పంపిణీ కార్యక్రమంలోమేయర్ కొలగాని శ్రీనివాస్ పాల్గొని అల్పాహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగామేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజా నేత బండి సంజయ్ కుమార్ జన్మదినం సందర్భంగా నగరవ్యాప్తంగా చేపట్టిన అనేక సేవా కార్యక్రమాలు ఎంతో సంతృప్తినిచ్చాయన్నారు. ముఖ్యంగా కార్పొరేటర్ నుండి కేంద్ర మంత్రి స్థాయి వరకు ఎదిగిన బండి సంజయ్ గారు , క్షేత్రస్థాయిలో దిగ్విజయనేత అని కొనియాడారు. "దేశ ప్రగతి కోసం, కరీంనగర్ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్న బండి సంజయ్ కుమార్ మరిన్ని పుట్టినరోజులు జరుపుకోవాలని, ఆయనకు భగవంతుడు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. బండి సంజయ్ గారి బాటలోనే నడుస్తూ, ప్రజా సమస్యల పరిష్కారం కోసం తామంతా నిరంతరం కృషి చేస్తాం" అని కొలగాని శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిజెపి అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, డిప్యూటీ మేయర్ వై సునీల్ రావు, బిజెపి కార్పొరేటర్లు కోఆప్షన్ మెంబర్లు ప్రజాప్రతినిధులు నాయకులు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# రామమందిరం విరాళాల చోరీకి నిరసనగా వీహెచ్ మౌనదీక్ష



**- ఎమ్మెల్యేలు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, ఆది శ్రీనివాస్ సంఘీభావం...**





**ఇల్లంతకుంట, జూలై 11(పీసీడబ్ల్యూ న్యూస్):** అయోధ్య రామమందిరం విరాళాల చోరీ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు (వీహెచ్) శనివారం మౌనదీక్ష చేపట్టారు. ఇల్లంతకుంట మండలం రామోజీపేట గ్రామంలో ఏర్పాటు చేసిన శిబిరంలో ఆయన మౌన నిరసన తెలిపారు. మానకొండూర్ ఎమ్మెల్యే, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణతో పాటు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ వీహెచ్ దీక్షకు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ, భగవాన్ రాముడి పేరుతో భక్తుల నుంచి సేకరించిన కోట్లాది రూపాయల విరాళాలు మాయమవడం, భక్తితో సమర్పించిన కానుకలు చోరీకి గురికావడం భక్తుల మనోభావాలను దెబ్బతీసిందని విమర్శించారు. నిత్యం రామనామాన్ని స్మరించే బీజేపీ నాయకులు రామమందిరంలో జరిగిన చోరీలపై మౌన ప్రేక్షకులుగా ఉండటం ఆశ్చర్యకరమన్నారు. రామమందిరం కోట్లాది హిందువుల విశ్వాసం, ఆత్మగౌరవంతో ముడిపడి ఉన్న అంశమని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి పవిత్రమైన విషయంలో జరిగిన అవినీతిని కేంద్ర ప్రభుత్వం, బీజేపీ నాయకత్వం కప్పిపుచ్చేందుకు ప్రయత్నించడం సిగ్గుచేటని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఏ మతానికీ, విశ్వాసానికీ వ్యతిరేకం కాదని, అయితే మతం పేరుతో జరిగే దోపిడీ, మోసాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోదని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే విరాళాల పూర్తి లెక్కలను ప్రజల ముందుంచి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డాక్టర్ కవ్వంపల్లి డిమాండ్ చేశారు. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, రాముడు సత్యానికి, ధర్మానికి ప్రతీక అని, ఆయన పేరుతో అక్రమాలకు పాల్పడితే ప్రజలు సహించరని అన్నారు. ఈ మౌనదీక్ష ద్వారా కేంద్ర ప్రభుత్వానికి కనువిప్పు కలిగించడమే తమ ఉద్దేశమని తెలిపారు. కోట్లాది మంది భక్తులు అత్యంత పవిత్రంగా భావించే అయోధ్య రామమందిరంలో నిధుల చోరీ వ్యవహారం తీవ్ర ఆందోళన కలిగిస్తోందన్నారు. బాధ్యులను గుర్తించి కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, ఇల్లంతకుంట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ, చైతన్య మహేందర్ రెడ్డి, పూట్కూరి వెంకటరమణారెడ్డి, గడ్డం నర్సయ్య, అలువాల కోటి, పసుల వెంకటి తదితరులతో పాటు వివిధ మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు, సర్పంచులు, సింగిల్ విండో చైర్మన్లు, గ్రామ పార్టీ శాఖల అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తహ్రీక్ తహఫ్ఫుజ్ నామూస్-ఎ-సహాబా ఆధ్వర్యంలో సీరత్-ఎ-సహాబా విజ్ఞాన, పోటీ పరీక్ష విజయవంతం

**• పోటెత్తిన విద్యార్థులు.. 900 మందికి పైగా విద్యార్థినీ విద్యార్థుల పాల్గొనడం**



**కరీంనగర్, జూలై 11(పిసిడబ్ల్యూ న్యూస్):** తహ్రీక్ తహఫ్ఫుజ్ నామూస్-ఎ-సహాబా కరీంనగర్ ఆధ్వర్యంలో శనివారం, మొహర్రం 22న 'సీరత్-ఎ-సహాబా విజ్ఞాన, పోటీ పరీక్ష' విజయవంతంగా నిర్వహించారు. ఈ పరీక్షలో 900 మందికి పైగా విద్యార్థినీ విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. కరీంనగర్‌లోని వివిధ పాఠశాలలు, కళాశాలలు, మదర్సాలు, మక్తబ్‌లకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పరీక్షకు హాజరయ్యారు. ఊహించని స్థాయిలో విద్యార్థులు తరలిరావడంతో పరీక్ష హాళ్లు కిక్కిరిసిపోయాయి. పరీక్ష నిర్వహణ కోసం మూడు కేంద్రాలను ఏర్పాటు చేశారు. విద్యార్థుల సౌకర్యార్థం ఉర్దూ, రోమన్ ఇంగ్లీష్ భాషల్లో పరీక్ష నిర్వహించారు. ఈ విజ్ఞాన, పోటీ పరీక్షను మూడు గ్రూపులుగా విభజించి నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. పరీక్షను విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన తహ్రీక్ బాధ్యులు, సభ్యులతో పాటు పాఠశాలలు, కళాశాలలు, మదర్సాలు, మక్తబ్‌ల నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. వారి సహకారం ప్రశంసనీయమని పేర్కొన్నారు. నిర్వాహకుల వివరాల ప్రకారం, జూలై 18 శనివారం మగ్రిబ్ నమాజ్ అనంతరం ఎస్ఎఫ్ఎస్ గార్డెన్‌లో 'అజ్మత్-ఎ-సహాబా, బహుమతుల ప్రదానోత్సవం' పేరిట భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా పరీక్షలో విజయం సాధించిన విద్యార్థినీ విద్యార్థులకు విలువైన బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.

